# మిన్నంటిన ఆనందం



హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత నివాసం వద్ద బాణాసంచా కాల్చి జై తెలంగాణ నినాదాలతో సంబురాలు జరుపుకుంటున్న నేతలు, కార్యకర్తలు. చిత్రంలో కార్పొరేషన్ల మాజీ చైర్మన్లు మేడే రాజీవ్‌సాగర్, పల్లె రవికుమార్‌గౌడ్, రామచంద్రనాయక్



తీహార్ జైలు నుంచి బయటకు వచ్చాక అభివాదం చేస్తున్న ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత



నల్లగొండలోని క్లాక్‌టవర్ సెంటర్‌లో పటాకులు సంబురాలు చేసుకుంటున్న శ్రేణులు



నిజామాబాద్ నగరంలోని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత కార్యాలయం ఎదుట భారత జాగృతి ఆధ్వర్యంలో సంబురాలు జరుపుకుంటున్న నాయకులు



తెలంగాణ భవన్ వద్ద పటాకులు కాల్చి జై తెలంగాణ నినాదాలు చేస్తున్న మాజీ ఉప ముఖ్యమంత్రి మహమూద్ అలీ, బీఆర్‌ఎస్ నేతలు

**ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు బెయిల్ మంజూరవడంతో హైదరాబాద్ సహా తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా సంబురాలు అంబరాన్నంటాయి. బీఆర్‌ఎస్ నేతలు, శ్రేణులు పెద్ద ఎత్తున బాణాసంచా కాల్చి, స్వీట్లు పంచి హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు. ఎక్కడికక్కడ బీఆర్‌ఎస్ శ్రేణుల 'జై తెలంగాణ' నినాదాలు మిన్నంటాయి. హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో ముఖ్య నేతలు పాల్గొని స్వీట్లు పంచుకున్నారు. చివరికి న్యాయమే గెలిచిందని సంతృప్తిని వ్యక్తం చేశారు. విదేశాల్లోనూ సంబురాలు జరుపుకోవడం విశేషం.**



బంజారాహిల్స్ కవిత నివాసంలో ఆమె కుమారుడు ఆర్యకు స్వీటు తినిపిస్తున్న మహిళలు



జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ సెంటర్‌లో టీబీజీకేఎస్ ఆధ్వర్యంలో పటాకులు కాల్చి సంబురాలు జరుపుకుంటున్న నాయకులు



లండన్‌లో సంబురాలు చేసుకుంటున్న బీఆర్‌ఎస్ ఎన్నారై యూకే నేతలు నవీన్‌రెడ్డి, అనిల్ కూర్మాచలం, రత్నాకర్ కడుదుల, రవి రేటినేని, సత్య చిలుముల



ఖమ్మంలోని బీఆర్‌ఎస్ జిల్లా కార్యాలయంలో స్వీట్లు తినిపించుకుంటున్న నాయకులు. చిత్రంలో మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య, సీనియర్ నేత ఆర్జేసీ కృష్ణ తదితరులు



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెంలో బాణాసంచా కాల్చి, జైతెలంగాణ నినాదాలు చేస్తూ సంబురాలు జరుపుకుంటున్న బీఆర్‌ఎస్ శ్రేణులు. చిత్రంలో కొత్తగూడెం మున్సిపల్ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి



ఢిల్లీలో మీడియాతో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి. చిత్రంలో మాజీ మంత్రులు గంగుల కమలాకర్, శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఎమ్మెల్యే సుమన్

# బెయిల్ రాగానే అంత అక్కసా?

- **కాంగ్రెస్, బీజేపీ ఒక్కటైనట్టు మళ్లీ తేలిపోయింది**
- **బండి సంజయ్, మహేశ్‌గౌడ్ వ్యాఖ్యలే నిదర్శనం**
- **మాజీ మంత్రులు వేముల, గంగుల, శ్రీనివాస్‌గౌడ్ మండిపాటు**
- **వారిద్దరి వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్**

హైదరాబాద్, ఆగస్టు 27 (నమస్తే తెలంగాణ): కర్ణాటకలో వాల్మీకి స్కామ్ జరిగి 5 నెలలైనా నోరుమెదపని బీజేపీ, ఎమ్మెల్సీ కవితకు సుప్రీం కోర్టు బెయిల్ మంజూరు చేసిన 5 నిమిషాలకే అక్కసు వెళ్లగక్కుతున్నదని బీఆర్‌ఎస్ పార్టీ ఆగ్రహం వ్యక్తం చేసింది. ఎమ్మెల్సీ కవితకు సుప్రీం కోర్టు బెయిలివ్వడంపై హర్షం ప్రకటించింది. బెయిల్ మంజూరు సమయంలో దేశ అత్యున్నత న్యాయస్థానం వ్యక్తపరిచిన అభిప్రాయాలే ఎమ్మెల్సీ కవిత తుది తీర్పు సమయంలో ఉంటాయన్న ఆశాభావం వ్యక్తంచేసింది. ఎమ్మెల్సీ కవిత కడిగిన ముత్యంలా కేసు నుంచి బయటికొస్తారని తేల్చిచెప్పింది. ఎమ్మెల్సీ కవితకు సుప్రీంకోర్టు బెయిల్ మంజూరు అనంతరం మాజీ మంత్రులు వేముల ప్రశాంత్‌రెడ్డి, గంగుల కమలాకర్, వీ శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ ఢిల్లీలో మంగళవారం మీడియాతో మాట్లాడారు. ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి, రాష్ట్ర కార్పొరేషన్ మాజీ చైర్మన్లు గెల్లు శ్రీనివాస్‌యాదవ్, గజ్జెల నగేశ్, బీఆర్‌ఎస్వీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుంగబాలు పాల్గొన్నారు. వాల్మీకి స్కామ్‌పై తెలంగాణ కాంగ్రెస్, బీజేపీ నేతల నోర్లెందుకు మూతపడ్డాయని ధ్వజమెత్తారు. కర్ణాటక కాంగ్రెస్ ప్రభుత్వం డబ్బు తెలంగాణ కాంగ్రెస్ నేతల ఖాతాల్లో జమయ్యాయని, దీనిపై కేంద్ర మంత్రి బండి సంజయ్ ఎందుకు నోరుమెదపడం లేదని ప్రశ్నించారు. కవితకు బెయిల్ వచ్చిన 5 నిమిషాల్లోనే అక్కసు వెళ్లగక్కిన బండి సంజయ్ భేషరతుగా న్యాయస్థానానికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కేంద్రమంత్రి బండి సంజయ్, పీసీసీ నేత మహేశ్‌కుమార్‌గౌడ్ వ్యాఖ్యలు న్యాయవ్యవస్థకు ఉద్దేశాలు ఆపాదించాయని, వారి వ్యాఖ్యలపై ఫిర్యాదు చేస్తామని చెప్పారు.

### పైశాచిక ఆనందం ఎందుకు?


కవితకు సుప్రీంకోర్టు బెయిల్ మంజూరు చేస్తే కాంగ్రెస్, బీజేపీలు పైశాచిక ఆనందం పొందుతున్నాయని మాజీ మంత్రులు మండిపడ్డారు. కాంగ్రెస్ నేతలు సోనియా, రాహుల్, చిదంబరంకు సుప్రీంకోర్టు బెయిల్ మంజూరు చేసిందంటే బీజేపీ, కాంగ్రెస్ కలిసిపోయాయని అనుకోవాలా? అని ప్రశ్నించారు. కరీంనగర్‌లో అమృత్ స్కీమ్ పనులు చేస్తున్న కాంట్రాక్టర్ సృజన్‌రెడ్డి సీఎం రేవంత్‌రెడ్డికి సమీపబంధువు కాదా? అని ప్రశ్నించారు.

### మద్యం పాలసీ కేసులో కవిత పాత్ర లేదు: కేకే



హైదరాబాద్, ఆగస్టు 27 (నమస్తే తెలంగాణ): ఢిల్లీ మద్యం పాలసీ కేసులో కవిత పాత్ర లేదని తాను భావిస్తున్నట్టు రాజ్యసభ మాజీ సభ్యుడు, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు కే కేశవరావు మంగళవారం నాడిక్కడ తెలిపారు. ఎమ్మెల్సీ కవితకు బెయిల్ రావడాన్ని తాను స్వాగతిస్తున్నట్టు చెప్పారు. బెయిలు పొందేందుకు కవిత అర్హురాలని తెలిపారు. రాజకీయంగా ఎన్ని కుట్రలు జరిగినా ఆమె పోరాడిందని, ఆ పోరాటానికి సుప్రీంకోర్టు ద్వారా ఫలితం దక్కిందని పేర్కొన్నారు.

### న్యాయం గెలిచింది: మహేశ్ బిగాల



ఢిల్లీ లిక్కర్ పాలసీతో ఏ మాత్రం సంబంధం లేకున్నా ఎమ్మెల్సీ కవితపై ఈడీ అక్రమ కేసు బనాయించి అన్యాయంగా జైల్లో వేయించడం బాధాకరమని బీఆర్‌ఎస్ ఎన్నారై కో ఆర్డినేటర్ మహేశ్ బిగాల ఆవేదన వ్యక్తంచేశారు. లిక్కర్ పాలసీలో ఆమెకు ప్రమేయం లేదని, ఇందుకు సంబంధించి ఆమె వద్ద నుంచి ఎలాంటి పత్రాలు, ఆధారాలు లభించలేదని చెప్పారు.

# చేయని తప్పుకి 5 నెలల నిర్బంధం

- **బండి వ్యాఖ్యలు అనాలోచితం**
- **అయ్యా.. బాంచెన్ అంటే ఎప్పుడో కవిత బయటకొచ్చేవారు: వినోద్**



హైదరాబాద్, ఆగస్టు 27(నమస్తే తెలంగాణ) : చేయని తప్పుకి ఐదు నెలలపాటు ఎమ్మెల్సీ కవితను నిర్బంధించారని మాజీ ఎంపీ వినోద్‌కుమార్ ఆవేదన వ్యక్తంచేశారు. ఆలస్యంగానైనా బెయిల్ రావడం సంతోషకరమని వ్యాఖ్యానించారు. మంగళవారం తెలంగాణ భవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ కవితపై పెట్టిన కేసు పూర్తిగా రాజకీయ ప్రేరేపితమని, కేసులో బీజేపీ వ్యతిరేక వ్యక్తులు లేకుంటే 15రోజుల్లో బెయిల్ వచ్చేదని తాను ఒక న్యాయవాదిగా చెబుతున్నానని స్పష్టంచేశారు. బీజేపీ వ్యతిరేక పార్టీల నాయకులు ఈ కేసులో ఉన్నారు కాబట్టే జైల్లో పెట్టారని చెప్పారు. ఢిల్లీ ప్రభుత్వం చేసిన లిక్కర్ పాలసీపై కేసు పెట్టారని, పైగా సౌత్ గ్రూప్ అని పేరుపెట్టి అహంకారంతో వ్యవహరించారని తెలిపారు. చిన్న కారణంతో తీవ్రమైన ఎండకాలంలో ఐదు నెలలు జైలులో ఉంచడం బాధాకరమని ఆవేదన వ్యక్తంచేశారు. ఈ కేసులో రూపాయి కూడా రికవరీ చేయలేదని, ఎవరో చెప్పిన దానికి కవితను అక్యూజ్ చేశారని చెప్పారు. అయ్యా.. బాంచెన్ అంటే కవిత ఎప్పుడో బయటకు వచ్చేదని, కానీ తలవంచకుండా గట్టిగా నిల్చొని పోరాడాము కాబట్టే ఇంతకాలం జైలులో ఉంచారని వినోద్ పేర్కొన్నారు.

**కేసీఆర్‌ను ఎదుర్కోలేకే: మహిళా నేతలు**

కేసీఆర్‌ను నేరుగా ఎదుర్కొనే దమ్ములేకనే కవితపై కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్నారని, ఆమెపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని బీఆర్‌ఎస్ మహిళా నేతలు తుల ఉమ, రజినీ సాయిచంద్, లలితారెడ్డి విమర్శించారు. ఈ కేసు నుంచి కడిగిన ముత్యంలా బయటకు వస్తారని పేర్కొన్నారు. లొంగని వాళ్లపై సీబీఐ, ఈడీలను బీజేపీ ప్రయోగిస్తున్నదని, కవిత విషయంలోనూ ఇదే జరిగిందని చెప్పారు. బెయిల్‌పై కాంగ్రెస్, బీజేపీ నేతలు చేస్తున్న వ్యాఖ్యలు సరికాదన్నారు.

**• ఇది ఫ్యాబ్రికేటెడ్ కేసు: న్యాయవాది భరత్**

కవితపై మోపిన ఆరోపణలు పూర్తిగా అవాస్తవమని, ఈ కేసు పూర్తిగా కల్పితమని, ఇది ఢిల్లీ ప్రభుత్వ విధానపరమైన నిర్ణయమని బీఆర్‌ఎస్ లీగల్ సెల్ కన్వీనర్ భరత్ పేర్కొన్నారు. కేసీఆర్‌పై కక్ష సాధించేందుకే కవితను జైల్లో పెట్టారని తెలిపారు. తప్పుడు సాక్షాలు, తప్పుడు మాటలతో కవితను 6 నెలలు అష్టకష్టాలు పెట్టారని, ఛండాలమైన ఆరోపణలు చేశారని, దుర్మార్గంగా మాట్లాడారని ఆవేదన వ్యక్తంచేశారు. బండి సంజయ్‌తోపాటు కాంగ్రెస్ నేతలు కోర్టుపై కూడా ఆక్షేపణలు చేస్తున్నారని, కోర్టు తీర్పును అవమానపరిచేలా మాట్లాడితే కంటెమ్ట్ ఆఫ్ కోర్టు పిటిషన్ వేస్తామని హెచ్చరించారు.

### బీజేపీ డ్రామా: ఎమ్మెల్సీ సుభాశ్‌రెడ్డి



ఎమ్మెల్సీ కవితపై నమోదైన కేసు రాజకీయ ప్రేరేపిత కుట్ర అని సుప్రీంకోర్టు వ్యాఖ్యలతో తేలిపోయిందని ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి పేర్కొన్నారు. కేసీఆర్ మనోనిబ్బరాన్ని దెబ్బతీయడం కోసం బీజేపీ ఆడిన డ్రామాలో నమోదైన కేసుగా అభివర్ణించారు.

### రాజకీయ కుట్రలు భగ్నం: దేవీప్రసాద్



సుప్రీం కోర్టు బెయిల్‌తో ఒక్కసారిగా రాజకీయ కుట్రలన్నీ పటాపంచలయ్యాయని బీఆర్‌ఎస్ నేత, బేవరేజెస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ దేవీప్రసాద్ చెప్పారు. ఇది బీజేపీ ఆడిన రాజకీయ డ్రామా అని అభివర్ణించారు.

### ఒక్క ఆధారం చూపలే: రాధారపు సతీశ్

ఎమ్మెల్సీ కవితకు వ్యతిరేకంగా ఒక్క ఆధారం చూపలేకపోయినందునే బెయిల్ మంజూరైందని ఎన్నారై బీఆర్‌ఎస్ సెల్ అధ్యక్షుడు రాధారపు సతీశ్‌కుమార్ పేర్కొన్నారు. ఆఖరికి న్యాయం గెలిచిందని తెలిపారు.



### బీజేపీ, కాంగ్రెస్‌కు అభ్యంతరాలెందుకు?

హైదరాబాద్, ఆగస్టు 27 (నమస్తే తెలంగాణ): ఢిల్లీ లిక్కర్ కేసు రాజకీయ ప్రేరేపితమని తేలిందని మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ స్పష్టంచేశారు. ఎమ్మెల్సీ కవితకు కోర్టు బెయిల్ మంజూరు చేస్తే కాంగ్రెస్, బీజేపీ నేతలకు ఉన్న అభ్యంతరం ఏమిటని ప్రశ్నించారు. మంగళవారం తెలంగాణ భవన్‌లో కార్పొరేషన్ మాజీ చైర్మన్లు సోమ భరత్‌కుమార్, పల్లె రవికుమార్‌గౌడ్‌తో కలిసి మీడియాతో మాట్లాడారు.



### బండి సంజయ్ అజ్ఞానానికి నిదర్శనం

ఎమ్మెల్సీ కవితకు సుప్రీం కోర్టు బెయిల్ మంజూరు చేయడంపై మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ఆధారాల్లేని కేసులో ఐదు నెలలు జైల్లో ఉంచడం బాధాకరమని, సుప్రీం నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని పేర్కొన్నారు. బెయిల్ అంశాన్ని రెండు రాజకీయ పార్టీల ఒప్పందంగా పేర్కొనడం కేంద్ర మంత్రి బండి సంజయ్ రాజకీయ అజ్ఞానానికి నిదర్శనమని, ఈ వ్యాఖ్యలు కోర్టు ధిక్కరణ కిందకే వస్తాయని స్పష్టంచేశారు. కర్ణాటకలో కాంగ్రెస్ ప్రభుత్వ అక్రమాలు బయటపడినా ఈడీ చర్యలేవని ప్రశ్నించారు.



### బీజేపీ కక్ష సాధింపు బట్టబయలు

ఎప్పటికైనా న్యాయమే గెలుస్తుందని, ఎమ్మెల్సీ కవితకు సుప్రీం కోర్టు బెయిల్ ద్వారా బీజేపీ కక్షసాధింపు చర్యలు బట్టబయలయ్యాయని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. కవితపైకి బీజేపీ ప్రభుత్వం ఈడీని ఉసిగొల్పి కేసు పెట్టించటం వల్ల అకారణంగా ఆమె నెలలుగా జైల్లో ఉన్నారని ఆవేదన వ్యక్తంచేశారు. సీఆర్ పదే పదే చెప్పున్నట్టు కవిత కడిగిన ముత్యంలా బయటికి వస్తారని చెప్పారు.



### బెయిల్‌ను ఐదు నెలలుగా అడ్డుకున్నరు

చేయని నేరానికి ఎమ్మెల్సీ కవితను అక్రమ కేసుల్లో ఇరికించి, ఐదు నెలల పాటు బెయిల్ రాకుండా అడ్డుకున్నారని ఆందోల్ మాజీ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్ ఆగ్రహం వ్యక్తంచేశారు. కవితకు బెల్ మంజూరుపై ఓ ప్రకటనలో హర్షం వ్యక్తంచేశారు. ఈ తప్పుడు కేసును సుప్రీంకోర్టు కొట్టివేయాలని కోరారు. కవితకు బెయిల్ వస్తే బండి సంజయ్ ఎందుకు గగ్గోలు పెడుతున్నారో అర్థం కావడం లేదని, ఆయన వ్యాఖ్యలను సుప్రీం కోర్టు సుమోటోగా స్వీకరించి విచారణకు ఆదేశించాలని క్రాంతి కిరణ్ డిమాండ్ చేశారు.



### లేనిది సృష్టించి ఇబ్బంది పెట్టిండ్రు

న్యాయమే గెలిచిందని, కవిత బెయిల్‌పై బయటకు రావడం సంతోషమని శాసనమండలిలో ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి అన్నారు. ఢిల్లీ మద్యం కుంభకోణం పేరుతో లేనిది సృష్టించి కవితను బీజేపీ జైలుకు పంపి ఇబ్బంది పెట్టిందని ఆవేదన వ్యక్తంచేశారు. కవిత వందశాతం నిరపరాధి అని, కడిగిన ముత్యంలా బయటకు వస్తారన్న నమ్మకం తమకున్నదని చెప్పారు. బీజేపీ సర్కారు దమనకాండకు ముగింపు పలకాలని అన్నారు.



### కాంగ్రెస్ నాయకులవి మతిలేని మాటలు

చేయని తప్పులో అన్యాయంగా ఇరికించినా ఎంతో ధైర్యంతో ఎమ్మెల్సీ కవిత ఫైటర్‌లా పోరాడారని బీఆర్‌ఎస్ నేత దాసోజు శ్రవణ్ అన్నారు. కవితకు బెయిల్ మంజూరు చేసిన సుప్రీం కోర్టుకు ధన్యవాదాలు తెలిపారు. విచారణ సందర్భంగా న్యాయమూర్తులు ఈడీ, సీబీఐల దర్యాప్తు తీరును తీవ్రంగా ఆక్షేపించాయని చెప్పారు. వారి వ్యాఖ్యలతో ఈ కేసు నిలవదని స్పష్టమైందని తెలిపారు. బీజేపీతో పొత్తులో భాగంగానే కవితకు బెయిల్ వచ్చిందని కాంగ్రెస్ నేతలు మతి స్థిమితం కోల్పోయి మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు.



### ఎమ్మెల్సీ కవిత నిర్బంధం అక్రమం

ఢిల్లీ మద్యం పాలసీతో ఏ మాత్రం సంబంధం లేకున్నా తమ పార్టీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితపై ఈడీ అక్రమంగా కేసు బనాయించి 165 రోజులు అన్యాయంగా జైల్లో ఉంచడం బాధాకరమని రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర ఆవేదన వ్యక్తంచేశారు. మంగళవారం ఆయన సుప్రీంకోర్టు వద్ద మీడియాతో మాట్లాడారు. ప్రజాప్రతినిధిగా ఉన్న కవితను ఇతర సామాన్య ఖైదీలా చూడటాన్ని కూడా న్యాయస్థానం తప్పుబట్టిందని చెప్పారు.